క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

తుగ్గలి: ఈనెల 4న ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఆదెమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కావాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

తప్పులు సరిచేయించుకోండి

తుగ్గలి: ఈ–క్రాప్ జాబితాలో తప్పులు ఉంటే రైతులు సరిచేయించుకోవాలని వ్యవసాయశాఖ మండల అధికారి పవన్ కుమార్ తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ జాబితాను శనివారం రామకొండ ఆర్‌బీకేలో ప్రదర్శించారు. మండల వ్యాప్తంగా 2,312 మంది రైతులు రబీ సీజన్‌లో 7,282 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారన్నారు. ఈ–క్రాప్ సామాజిక తనిఖీ కోసం ముసాయిదా జాబితాలో గ్రీవెన్స్‌కు ఆదివారం వరకు గడువు ఉందని, ఆలోగా ఏవైనా పొరపాట్లు ఉంటే సరిచేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ రవికుమార్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



వన్యప్రాణుల మాస్కులతో విద్యార్థులు

ఆలూరు రూరల్: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త వెంకటరమణా రెడ్డి, హులేబీడు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సురేష్‌బాబు తెలిపారు. శనివారం జెడ్పీ పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఎకో క్లబ్ విద్యార్థులు వన్యప్రాణుల మాస్కులతో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు మల్లికార్జున, నరసింహులు, శంకర్‌రావు, అయ్యలప్ప, ముత్తమ్మ ఉన్నారు.

నిధులు మంజూరు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణాలను రూ.10 లక్షల జెడ్పీ నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రంగనాథ స్వామి ఆలయం నుంచి గ్రామ శివారు వరకు రూ. 5లక్షలతో సీసీ డ్రైనేజీ, మార్కెట్ నుంచి టెంపుల్ షెడ్ వరకు మరో రూ.5 లక్షలతో డ్రైనేజీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అట్టహాసంగా ఎడ్ల గిరక బండి పోటీలు



గిరక బండి లాగుతున్న వృషభాలు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో కాశీలింగేశ్వస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శుక్రవారం ఎడ్ల గిరక బండి పోటీలు నిర్వాహించారు. మొదటి బహుమతి హనుమంతరాయుడు ఎడ్లు, రెండవ బహుమతి బోయ కళ్యాణ్, మూడవ బహుమతి కురవ అయ్యాలప్ప, నాల్గవ బహుమతి బోయ రామకృష్ణ ఎడ్లు గెలుచుకున్నాయి. విజేతల యజమానులకు వరుసుగా రూ.10,016, రూ.7,016, రూ.5,016, రూ.2,516 నగదు బహుమతులను దాతలు సోమేశ్వరరెడ్డి, నాగేష్‌గౌడ్, డి.రంగన్న, వెంకటేశ్వరరెడ్డి విజేతలకు అందజేశారు.

గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ సూచించారు. శనివారం పట్టణంలోని 18, 19, 20వ వార్డుల్లో బూత్ కమిటీ అధ్యక్షులకు 'మేము సిద్ధం– మాబూత్ సిద్ధం' కిట్లను జేసీఎస్ కన్వీనర్ బంగి శ్రీరాం, కౌన్సిలర్ పూజేశ్వరి, వార్డు ఇన్‌చార్జ్ సోమేష్, బుట్టా నాగరాజులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బంగి ప్రమీల, వార్డు గృహసారథులు, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

5న జాబ్ మేళా

ఆలూరు రూరల్: ఈనెల 5 స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సూరప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ ట్రేడ్లు పూర్తి చేసిన వారు, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలు, బయోడేటా ఫారం, 5 పాస్ ఫొటోలు ఆధార్ కార్డుతో జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు. ఎంపికై న వారికి రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు వేతనం ఉంటుందన్నారు.

సాయిబాబా వార్షికోత్సవం

ఆలూరు: మండలంలోని కమ్మరచేడు గ్రామంలో సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సాయి పారాయణం, శాంతి హోమం చేశారు. అంతకుముందు సాయిబాబా విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు.

ఆర్బీకేలతో వ్యవ'సాయం' విస్తృతం

చంద్రబాబు గతంలో వ్యవసాయం దండగా అంటూ అన్నదాతను నిర్లక్ష్యం చేశారు.. దేశానికి అన్నం పెట్టే అన్నదాత సుభిక్షంగా ఉంటేనే అందరం బాగుంటామని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం వ్యవసాయానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఏటా పెట్టుబడి సాయంతో పాటు ప్రతి పల్లెలో ఆర్‌బీకే ఏర్పాటు చేసి విత్తనాలు, మందులు, ఎరువులు, సలహాలు, సూచనలు అందిస్తూ వ్యవసాయాన్ని పండుగలా మార్చారు.



ఆర్బీకేలో సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఆర్బీకేలను ఏర్పాటు చేసి అందరి ప్రశంసలు పొందుతున్నారు. ప్రతి గ్రామంలో ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎక్కడి రైతులకు సేవలందేలా చూస్తున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 64 రైతు భరోసా కేంద్రాలను రూ.15.32 కోట్లతో నిర్మిస్తున్నారు. విత్తనాల పంపిణీ మొదలు పంట విక్రయం వరకు ఆర్బీకేలా ద్వారానే జరిగేలా చర్యలు చేపట్టారు. భూసార పరీక్షలు, సబ్సిడీ, నాన్ సబ్సిడీ విత్తనాల పంపిణీ, ఎరువులు, పురుగు మందుల విక్రయం అందజేస్తారు. కౌలు రైతులకు మేలు జరిగేలా పంటసాగు హక్కు పత్రాలు(సీసీఆర్‌టీ) జారీ చేస్తున్నారు. వైఎస్‌ఆర్ రైతు భరోసాకు అర్హుల జాబితాను ఆర్బీకేల ద్వారానే ఎంపిక చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో ఈ–క్రాప్‌తో రైతుల వివరాలు, సాగు చేసిన పంట వివరాలు పొందుపరుస్తారు. ప్రతి పంటకు ఆర్బీకేల ద్వారానే ఉచితంగా పంటబీమా చేస్తున్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన పండ్లతోటల పెంపకం, డ్రిప్ ఏర్పాటు, పశువులదాణా, గడ్డి విత్తనాలు, వ్యవసాయ యంత్ర సామగ్రి గొర్రు, ట్రాక్టర్, ఉల్లి విత్తు యంత్రాలు మొదలైనవి పొందాలంటే ఆర్బీకేల్లోనే రైతులు నమోదు చేసుకోవాలి. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేనప్పుడు ఆర్బీకేలా ద్వారానే పంట మద్దతు ధరతో దిగుబడులను కొనుగోలు చేయాలి. నెరోజుల వ్యవధిలోపే రైతులకు విక్రయ సొమ్ము అందేలా చూస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు వల్ల వ్యవసాయ అనుబంధ రంగాలైన పశుసంవర్ధక, మత్స్యకార, హార్టికల్చర్ సిబ్బంది ఒకే చోట రైతులకు అందుబాటులో ఉంటున్నారు. వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు.

నియోజకవర్గంలో రైతు భరోసా కేంద్రాలు	:	64
నిర్మాణపు అంచనా	:	రూ.15.32కోట్లు
ఉద్యోగులు	:	64
సాగుభూమి	:	1,47,990 ఎకరాలు
పంటసాగు చేసే రైతులు	:	44,661మంది

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రైతులకు సీఎం జగన్ అందించిన సాయం

పథకం	సాయం పొందిన రైతులు	అందించిన మొత్తం (రూ॥)
వైఎస్సార్ రైతు భరోసా	43,733	212.04కోట్లు
డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా	42,049	103.13 కోట్లు
వెఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు	12,853	145.03కోట్లు
రెతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	1454	1.13కోట్లు
వెఎస్సార్ మత్స్యకార భరోసా	542	4.85కోట్లు



రైతు భరోసా కేంద్రం

గతంలో విత్తనాలకు ఇబ్బంది ఉండేది



తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు రైతులకు తీవ్ర దుర్భిక్షమే. సబ్సిడీ విత్తనాలు పొందాలంటే రోజుల తరబడి లైన్లో నిలవాల్సిందే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఆర్బీకేలు ఏర్పాటు కావటం , రైతులకు చెందిన ప్రతిపని గ్రామస్థాయిలోనే జరగటం మా అదృష్టం – **పరమేష్, గురుజాల**

పంటకు గిట్టుబాటు ధరలు



ఆర్బీకేలు ఏర్పాటుతో అధికారులు గ్రామాల్లోనే అందుబాటులో ఉంటున్నారు. పంటసాగుకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీతో ఇస్తున్నారు. అధికారులు పంటలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సూచనలు ఇస్తున్నారు. బీమా సౌకర్యం, రైతుభరోసా సొమ్ములు అందిస్తున్నారు. రైతులకు ఇన్ని విధాలుగా సాయమందించే ప్రభుత్వమిది. – **కురువ భీరప్ప, జొహరాపురం**

ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం



రైతు బాగు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయటం వల్ల పంటకు, రైతులకు అవరమైన ప్రతి పని అక్కడే జరిగి పోతుంది. పంటలపై రైతులకు అవగాహన పెరుగుతోంది. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం.

– **బుట్టా రేణుక,**
వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. పెండేకల్లులో రూ.67.09 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకేను శనివారం ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శమన్నారు. ఎన్నికల ముందు గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొస్తానని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి సంక్షేమ పథకాలు ప్రజల చెంతకే చేరవేస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. మోసాల టీడీపీని, సంక్షేమ పథకాలు ఇంటికే చేర్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని బేరీజు వేసుకొని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్ లీలావతి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పెద్ద రంగన్న, నాయకులు బసిరెడ్డి, గంగన్న, మోహన్‌రెడ్డి, హనుమంత్, దివాకరరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మైనారిటీ కమ్యునిటీ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కమ్యూనిటీ భవనం ప్రారంభం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో రూ.30 లక్షల ఎంపీ నిధులతో(రాజ్యసభ్యులు ఆర్.కృష్ణయ్య) నిర్మించిన మైనారిటీ కమ్యూనిటీ హాల్‌ను శనివారం ఎమ్మెల్యే శ్రీదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మురళీధర్‌రెడ్డి, సర్పంచులు కారుమంచి మల్లికార్జున, విజయుడు ఉపసర్పంచు గోపాల్, నాయకులు రామలిగారెడ్డి, మోహన్‌రెడ్డి, మైనారిటీ నాయకులు ఖాజావలి, నబిరసూల్, బడేపీరా, కట్టుబడి పీరా, లాలూ, అక్బర్ ఎంపీటీసీ జ్యోతిలత పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ దినేష్

నందవరం: మహా శివరాత్రి ఉత్సవాలకు గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రం ముస్తాబవుతోంది. భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పెద్దనరసింహులు, గ్రామ సర్పంచ్ వీరస్వామితో కలిసి ఈఓ దినేష్ శనివారం పరిశీలించారు. క్యూలైన్లు, చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు నరసింహులు, ఈరన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయించండి




చిరుమాన్‌దొడ్డి జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ ఆదినారాయణ

ఆలూరు: జగనన్న కాలనీల లబ్ధిదారులతో గృహ నిర్మాణాలు పూర్తి చేయించాలని ఆలూరు హౌసింగ్ డీఈ ఆదినారాయణ సిబ్బందిని ఆదేశించారు. ఆలూరు మండలం కమ్మరచేడు, మనేకుర్తి, ఆస్పరి మండలం శంకరబండ, చిరుమాన్‌దొడ్డి తదితర గ్రామాల జగనన్న కాలనీలలో జరుగుతున్న గృహ నిర్మాణాలను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆలూరులోని హౌసింగ్ డీఈ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని మొత్తం 5,670 గృహాలలో ఇప్పటి వరకు 2,146 పూర్తయ్యాయన్నారు. మిగతా గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. లబ్ధిదారుల చేత త్వరగా పూర్తి చేయించాలని ఏఈ, వర్క్ఇన్స్పెక్టర్లకు సూచించారు.

పోలియో చుక్కలు వేయించాలి

హాలహర్వి: పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఇన్‌చార్జ్ బి.విరూపాక్షి సూచించారు. శనివారం చింతకుంట గ్రామంలో వైద్య సిబ్బంది చేపట్టిన పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–కన్వీనర్ జనార్దన నాయుడు, చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య, ఎంపీపీ నెట్టికంటమ్మ, వైస్ ఎంపీపీ నగేష్, మండల కన్వీనర్ పచ్చారపల్లి రామిరెడ్డి, కో–కన్వీనర్ మల్లికార్జున, చింతకుంట సర్పంచ్ సద్దాం, సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, తిప్పారెడ్డి, వైద్యాధికారులు రాజమ్మ, ఏఎన్‌ఎం మేరీ, సుజాత, ఆశావర్కర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సలీంబాషా

వెల్దుర్తి(కృష్ణగిరి): భయపడకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీఎస్ సలీంబాషా సూచించారు. శనివారం ఆయన కర్నూలు సెట్కూరు యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వెల్దుర్తి జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లు, కేజీబీవీ, బీసీ గురుకులం, బోయనపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లలో పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. పరీక్షలంటే భయం, మానసిక ఆందోళన చెందవద్దన్నారు. ప్రణాళిక ప్రకారం చదివి, ఆరోగ్యంగా ఉంటూ పరీక్షలకు హాజరుకావాలన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోనెగండ్ల/నందవరం: ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గోనెగండ్ల, నందవరం మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు షాహినా పర్వీన్, చంద్రశేఖర్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 2012 సెప్టెంబర్ 1– 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఓసీ, బీసీ విద్యార్థులు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెండేళ్ల సడలింపు ఉంటుందన్నారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూల్‌లో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 31 లోపు ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 ఫీజు చెల్లించి www.cse.ap.gov.in లేదా https://apms.ap.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

యువకుడి బలవన్మరణం



పవన్‌కుమార్ (ఫైల్)

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన కమ్మరి పవన్‌కుమార్(21) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పవన్‌కుమార్ కొద్దికాలంగా టీబీ, శ్వాస సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. కర్నూలులోని పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.శ్రీనివాసులు తెలిపారు.

విరాళం



విరాళం ఇస్తున్న నారాయణ

చిప్పగిరి: శివ స్వాముల పూజల నిమిత్తం ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ నారాయణ రూ.10 వేల విరాళమిచ్చారు. మండలంలోని నంచర్ల గ్రామ సమీపంలో బుగ్గసంగమేశ్వర స్వామి ఆలయంలో శనిఆరం శివలింగ శివ స్వామి ఆధ్వర్యంలో ఇరిముడి కార్యక్రమం నిర్వహించారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



కర్నూలు ఆసుపత్రి వద్ద స్ట్రెచర్‌పై ఉన్న వెల్దుర్తి మాధవికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ నరేంద్ర

పింఛన్ల పంపిణీ శనివారం కొనసాగింది. రెండు రోజు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వేలిముద్రలు తీసుకుని పింఛన్ సొమ్ము అందజేశారు. కొందరు కొన్ని కారణాల వల్ల ఇతర ప్రాంతాల్లో ఉన్నారని తెలుసుకుని అక్కడికే వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. నందవరం మండలంలో 84.43 శాతం, దేవనకొండ మండలంలో 80 శాతం, హొళగుంద మండలంలో 70 శాతం పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్

టీషర్టుల పంపిణీ



టీషర్టులు పంపిణీ చేసిన డీఎస్పీ సీతారామయ్య

ఎమ్మిగనూరుటౌన్: భక్తులకు సేవలందించే పలువురికి స్థానిక మేఘన స్పోర్ట్స్ వీరారెడ్డి సహకారంతో టీషర్టులు అందజేశారు. శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు నల్లమలలోని నాగలూటి వీరభద్ర స్వామి ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. అక్కడ శిబిరంలో సేవలందించే సభ్యులకు డీఎస్పీ సీతారామాంజనేయులు, మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు టీషర్టు అందజేశారు. కార్యక్రమంలో మల్లెల గ్రూప్ సభ్యులు సాల్మాన్‌రాజు, సతీష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివ పార్వతుల పూజ

హొళగుంద: మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో శనివారం పార్వతి పరమేశ్వరస్వాముల పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. శివదీక్ష తీసుకున్న స్వాములు స్థానిక పోతులింగేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో పార్వతి పరమేశ్వరుల పడిపూజ నిర్వహించారు. అనంతరం లింగాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

గ్రామ స్వరాజ్యం కల సాకారం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

● ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
● చిన్నహుల్తిలో రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

పత్తికొండటౌన్: సచివాలయాల ద్వారా పాలనను గ్రామస్థాయికి తీసుకువచ్చి గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండలంలోని చిన్నహుల్తి గ్రామంలో శనివారం సాయంత్రం రూ.1.25 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. జల్‌జీవన్ మిషన్ కార్యక్రమం కింద రూ.50 లక్షలతో పూర్తిచేసిన ఇంటింటికి కుళాయి పనులు, రూ.30లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాలువలు, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.20.84 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గ్రామంలోనూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అన్ని ప్రభుత్వశాఖలు అన్నీ గ్రామ సచివాలయం ద్వారా ఉద్యోగులు గ్రామాలకే వెళ్లి ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. అలాంటి ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ కేశవరెడ్డి, ఎంపీడీఓ రామారావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఉరుకుందమ్మ, ఎంపీపీ నారాయణదాసు, ఉప సర్పంచ్ దొరస్వామి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, లింగన్న, ఇమామ్, మాదిగ ఉసేని, సోమశేఖర్, గాంధీరెడ్డి, కారం నాగరాజు, నలకదొడ్డి కృష్ణ, రహిమాన్, ప్రభాకర్‌రెడ్డి, నీలకంఠ, టీఎండీ హుసేన్ పాల్గొన్నారు.

జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి




మల్లికార్జునపల్లిలో వృద్ధురాలిని పలకరిస్తున్న విరూపాక్షి

హాలహర్వి: జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.విరూపాక్షి తెలిపారు. శనివారం కొక్కరచేడు, శ్రీధర్‌హాల్, బేవినహాల్, మల్లికార్జునపల్లి గ్రామాల్లో పర్యటించారు. సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలు ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విరూపాక్షి హామీ ఇచ్చారు. 2024లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ఆలూరు నియోజకవర్గంలో కూడా వైఎస్సార్‌సీపీ ఎగరేద్దామన్నారు. ఆయన వెంట ఎంపీపీ నెట్టికంటమ్మ, పార్టీ మండల కన్వీనర్ రామిరెడ్డి, కో–కన్వీనర్ మల్లికార్జున, రాష్ట్ర కో–కన్వీనర్ జనార్ధననాయుడు, వైస్ ఎంపీపీ నగేష్ తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి పనిచేద్దాం

దేవనకొండ: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పని చేద్దామని మండల జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తపాల శ్రీను సూచించారు. శనివారం మండల కేంద్రంలో 'మేము సిద్ధం –మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.వెంకటేష్, లుముంబా, సర్పంచ్ బాబు, వార్డుమెంబర్ వినోద్, సచివాలయ కన్వీనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలి



డాక్టర్ జి.మమతను సన్మానిస్తున్న కాలేజీ డైరెక్టర్ యాజమాన్యం

ఎమ్మిగనూరు రూరల్: మహిళలు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని అనంతపురం జేఎన్‌టీయూ సీఈసీ విభాగపతి డాక్టర్ జి.మమత సూచించారు. మంగళవారం ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో కాలేజీ డైరెక్టర్ కె.అనసూయ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీరన్నల ఆధ్వర్యంలో ముందస్తు మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు.